'మాప్ అప్ డే' విజయవంతం

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం సంగారెడ్డి జిల్లాలో సోమవారం విజయవంతంగా ముగిసింది. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 11న జిల్లావ్యాప్తంగా 3,77,572 మంది పిల్లలకు నులిపురుగుల మాత్రలను పంపిణీ చేశారు. మిగిలిపోయిన 29,636 మందికి మాప్‌అప్‌డే సందర్భంగా మాత్రలు పంపిణీ చేశారు. జిల్లాలో మాత్రల పంపిణీ పూర్తి చేసినట్టు వైద్య ఆరోగ్య శాఖ అధికార వర్గాలు తెలిపాయి.

కుండపోత

మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో విస్తారంగా వర్షాలు

అత్యధికంగా అల్లాదుర్గంలో 22 సెం.మీ., తూప్రాన్‌లో 19 సెం.మీ., కంగ్టిలో 17సెం.మీ.లు



- ఉధృతంగా ప్రవహిస్తున్న మంజీర నది
- పొంగిపొర్లుతున్న నల్లవాగు, నారింజ వాగులు
- చెరువు కట్టలకు గండ్లు, తెగిన కల్వర్టులు
- వందల ఎకరాల్లో నీట మునిగిన పంటలు
- కోళ్లఫారంలోకి వరద.. హత్నూరలో 3వేల కోళ్లు మృతి
- జలదిగ్బంధంలోనే ఏడుపాయల వనదుర్గా ఆలయం
- నష్టాన్ని అంచనా వేస్తున్న అధికార యంత్రాంగం

ఆదివారం అర్ధరాత్రి ఆకాశానికి చిల్లు పడ్డట్టుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వానకు మెదక్, సంగారెడ్డి జిల్లాలు తలాకుతలమయ్యాయి. విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి. వాగులు, వంకలు, మంజీర నది పొంగిపొర్లుతున్నాయి. వందల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. కల్వర్టులు కొట్టుకుపోయాయి. జన జీవనం అస్తవ్యస్తమైంది. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. వానలు తగ్గితేనే నష్టం వివరాలు తెలిసే అవకాశముంది.

సంగారెడ్డి జిల్లాలో భారీ వర్షం



భారీ వర్షానికి కంగ్టి-ముకుంద్ తండా మధ్య కొట్టుకుపోయిన వంతెన

సంగారెడ్డి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా వ్యాప్తంగా ఆదివారం రాత్రి నుంచి భారీ వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. సోమవారం ఉదయం వరకే వాగులు పొంగిపొర్లడంతో రహదారులపైకి వరద ప్రవాహం వచ్చిచేరింది. ఎక్కడికక్కడ రాకపోకలు స్తంభించాయి. వందల ఎకరాల్లో పచ్చని పంటలు నీట మునిగాయి. వరద తాకిడికి వ్యవసాయ భూముల్లో ఇసుక మేటలు ఏర్పడ్డాయి. నల్లవాగు ఉధృతికి నారాయణఖేడ్ నియోజకవర్గంలోని పలు గ్రామాలకు రవాణా నిలిచిపోయింది. హత్నూర మండలం ఎల్లమ్మగూడలోని ఓ కోళ్లఫారంలోకి వరద రావడంతో సుమారు 300 కోళ్లు చనిపోయాయి. పదుల సంఖ్యలో శిథిలావస్థకు చేరిన ఇండ్లు నేలమట్టమయ్యాయి. ఇక మంజీర నది ప్రవాహం క్రమంగా పెరుగుతూనే ఉంది. ఇప్పటికే సింగూరు ప్రాజెక్టు నుంచి 5గేట్లతో దిగువకు నీటిని వదులుతుండగా మరో రెండు గేట్లు ఎత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కంగ్టిలో అత్యధికం

కంగ్టి మండలంలో అత్యధికంగా 17 సెం.మీల వర్షపాతం నమోదైంది. నిజాంపేటలో 13 సెం.మీ, కల్హేర్‌లో 11 సెం.మీలు, సిర్గాపూర్‌లో 10. 7 సెం.మీలు, అందోల్‌లో 10.3 సెం.మీలు, గుమ్మడిదల, జిన్నారం మండలాల్లోనూ 9 సెం.మీలపైగా వర్షపాతం కురిసింది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో 2 సెం.మీ.ల కంటే ఎక్కువగా వర్షాలు పడ్డాయి. ఈ సీజన్‌లో ఇదే అత్యధికమని అధికారులు పేర్కొన్నారు.

స్తంభించిన రాకపోకలు

- కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో నల్లవాగు ప్రవాహం కారణంగా రాకపోకలు స్తంభించాయి.
- కంగ్టి మండల కేంద్రం నుంచి ముకుంద్ నాయక్ తండా మధ్య వంతెన కొట్టుకుపోయింది. ముర్కుంజాల్- రాసోల్ గ్రామాల మధ్య కల్వర్టు తెగడంతో రాకపోకలు నిలిచిపోయాయి.
- మునిపల్లి మండలం తక్కడపల్లి- గార్లపల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు సింగూరు బ్యాక్‌వాటర్ కారణంగా ఆగిపోవడంతో రాకపోకలు స్తంభించాయి.
- గుమ్మడిదల మండలం అన్నారం వద్ద జాతీయ రహదారిపై వరద నీరు నిలవడంతో భారీగా ట్రాఫిక్‌జాం ఏర్పడింది.

పంటలకు నష్టం.. ఎంతో కష్టం

ఇన్నాళ్లు సాగునీరు లేక ఎండిపోయే స్థితికి చేరిన పంటల పరిస్థితి తాజా వర్షాలతో భిన్నంగా మారాయి. చాలాచోట్ల వరద ప్రవాహానికి నీట మునిగాయి. ఇంకా వర్షం కురుస్తున్న నేపథ్యంలో మునిగిన పంటల నష్టాన్ని అంచనా వేయడానికి అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. ప్రధానంగా పత్తి, వరి, మొక్కజొన్న పంటలు వందలాది ఎకరాల్లో నీట మునిగాయి. అష్టకష్టాల నేపథ్యంలో చేతికి వచ్చిన యూరియాను చాలామంది రైతులు పంట పొలాల్లో చల్లారు. ఆ యూరియా సైతం వర్షానికి కొట్టుకుపోయిందని రైతులు మొరపెట్టుకున్నారు.

మెతుకుసీమ అతలాకుతలం

మెదక్/అల్లాదుర్గం/తూప్రాన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లావ్యాప్తంగా ఆదివారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. చెరువులు, కుంటలు నిండిపోయాయి. మంజీర నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. గడిచిన 24 గంటల్లో అల్లాదుర్గంలో అత్యధికంగా 22 సెం.మీ.లు, తూప్రాన్‌లో 17.9 సెం.మీ.ల వర్షం కురిసింది. పెద్దశంకరంపేటలో 170.5, వెల్దుర్తిలో 165.1, మాసాయిపేటలో163.1, కొల్చారంలో 137.5, టేక్మాల్‌లో 129.4, చిలప్‌చేడ్‌లో 118.7, నర్సాపూర్‌లో 126.5, శివంపేటలో 147 మి.మీ.ల వర్షపాతం నమోదైంది.

- అల్లాదుర్గం మండలంలో గత పాతిక సంవత్సరాల్లో అత్యధిక వర్షపాతం కురిసినట్లు అధికారులు తెలిపారు. అల్లాదుర్గం బట్టికుంట అలుగుకు గండి పడిడటంతో రోడ్డు మీదుగా నీరు ప్రవహిస్తున్నది. ఓ వ్యక్తి బైక్ కొట్టుకుపోయింది. కోమటి కుంటకు వెళ్లే రోడ్డు కోతకు గురైంది. గడిపెద్దాపూర్ పెద్దచెరువు పంట కాల్వకు గండి పడటంతో నీరంత పొలాలను ముంచేసింది. నీలకంఠపల్లికి వెళ్లే రోడ్డు ధ్వంసమైంది. చిల్వర్‌లో పాఠశాల ఆవరణలో గజం లోతు నీళ్లు నిలువడంతో తరగతి గదుల్లోకి వర్షపు నీరు చేరింది.
- తూప్రాన్ చరిత్రలో అత్యధిక వర్షపాతం కురిసింది. ఆదివారం రాత్రి 12 గంటల్లోనే 179.5 మి.మీ.ల వర్షపాతం నమోదయ్యింది. 750 ఎకరాల అయకట్టు కలిగిన తూప్రాన్ పెద్ద చెరువు అలుగు పారింది. పట్టణంలోని లోతట్టు కాలనీలు నీట మునిగాయి. ఇళ్లలోకి నీరు రావడంతో వస్తువులన్నీ దెబ్బతిన్నాయి.
- మనోహరాబాద్: మండలంలో ఒక్కటి మినహా చెరువులన్నీ అలుగు పారుతున్నాయి. రామాయపల్లి వద్ద 44వ జాతీయ రహదారి అండర్‌పాస్ నీట మునగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఓ ఆర్టీసీ బస్సు నీటి మధ్యలో 4 గంటలు నిలిచిపోయింది. కొంతసేపటికి లారీలు వెళ్లగా ప్రయాణికులు బస్సులోనే ఉండిపోయారు. పోలీసులు చేరుకుని వచ్చి మరోక వైపు ఉన్న దారి ఇరువైపుల వాహనాల రాకాపోకాలు కొనసాగించారు. నీటి తోడేసిన తరువాత ఆర్టీసీ బస్సును బయటకు తరలించారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ నెమ్మదిగా కదిలింది.
- పాపన్నపేట: మండలంలో మంజీరా నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో 100 ఎకరాల్లో పొలాలు మునిగిపోయాయి. ఘనపురం వన దుర్గ ప్రాజెక్టు పొంగిపొర్లుతున్నది. బ్యాక్‌వాటర్ నిలిచిపోవడంతో నాగ్‌సానిపల్లిలో... నిజాంసాగర్ బ్యాక్‌వాటర్ కారణంగా పాపన్నపేట, బారాకానల్, కొంపల్లి, మల్లంపేట, రామతీర్థం, ముద్దాపూర్, మిన్పూర్, కుర్తివాడ గ్రామాల్లో పొలాలు నీట మునిగాయి. ఐదు రోజులుగా ఏడుపాయల వన దుర్గభవాని అమ్మవారి ఆలయం జలదిగ్బంధంలో ఉంది. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురంలో ప్రతిష్ఠించి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. పర్యాటకుల రద్దీ పెరగడంతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.
- టేక్మాల్: గుండువాగు ఉధృతంగా ప్రవహించడంతో బొడ్మాట్‌పల్లిలో ఇళలోకి వర్షపు నీరు చేరింది. జోగిపేట-టేక్మాల్ రోడ్డుపై రాకపోకలు నిలిచిపోయాయి. కలెక్టర్ రాహుల్‌రాజ్ గుండువాగు ప్రవాహాన్ని పరిశీలించారు.
- నర్సాపూర్: మండలంలోని ఖాజీపేట మోతుకుల కుంటకు కట్ట కోతకు గురవడంతో నాలుగెకరాల్లో వరి మునిగిపోయింది. ఖాజీపేట-తిర్మలాపూర్ రోడ్డుపై రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.
- శివ్వంపేట: మండలంలో ఎనిమిది నెలల క్రితం నిర్మించిన ఉసిరికపల్లి వెల్దుర్తి రెండు వరసల రోడ్డు తెగిపోయింది. వెల్దుర్తి, శివ్వంపేట మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలో 47 ఇల్లు కూలిపోయాయని తహసీల్దార్ కమలాద్రి తెలిపారు.
- కొల్చారం: కొల్చారం వైపు నుంచి ఘనపూర్ ఆనకట్టకు వెళ్లకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలో కుంటలు చెరువులు, కుంటల అలుగులు, వాగులు పారుతున్నాయి.

బ్రిడ్జిపైకి నీరు..

వెల్దుర్తి మండలంలో హల్దీవాగుపై చెక్‌డ్యాములు పొంగిపొర్లుతున్నాయి. ఉప్పులింగాపూర్ బ్రిడ్జిపైకి నీరు చేరింది. పెద్దశంకరంపేట

మిగతా 8వ పేజీలో



.సంగారెడ్డి మండలంలోని ఇర్గిపల్లిలో నీట మునిగిన పత్తిపంట



నర్సాపూర్: ఖాజీపేట మోతుకుల కుంటకు గండి



మనోహరాబాద్: హైవే 44 అండర్‌పాస్‌లో చిక్కుకున్న బస్సు



తూప్రాన్ గాయత్రినగర్ కాలనీలో నిలిచిపోయిన వర్షపు నీరు

ప్రజావాణికి వర్షం ఎఫెక్ట్

సంగారెడ్డిలో 28 దరఖాసులు మాత్రమే



ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం బోసిపోయింది. సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 28 దరఖాస్తులే వచ్చాయి. కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, నారాయణఖేడ్ సబ్‌కలెక్టర్ ఉమాహారతి అర్జీలు స్వీకరించారు. వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ప్రావిణ్య ఆదేశించారు.

-సంగారెడ్డి టౌన్ , ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి)

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- సింగూరు డ్యామ్ భద్రతపై ఆందోళన వద్దు
- మంత్రి దామోదర్ రాజనర్సింహ

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అవసరమైన ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో డెంగ్యూ, మలేరియా, సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు ప్రబలకుండా వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంల సమన్వయంతో పంచాయతీ మల్టీపర్పస్ సిబ్బందితో గ్రామంలో అవసరమైన పారిశుధ్య చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా తదితర వ్యాధుల నివారణకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీలోనూ ఫాగింగ్ చేపట్టాలన్నారు. సింగూరు డ్యాం భద్రతపై ఆందోళన చెందవద్దని, మరమ్మత్తుల సమయంలో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుకు మరమ్మతులను చేయించడంపై గత

మిగతా 8వ పేజీలో

సమానత్వానికి మార్గదర్శకులు సర్వాయి పాపన్న



సంగారెడ్డిలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

వార్త 8వ పేజీలో



టెండర్లను తెరుస్తున్న మెదక్ అదనపు కలెక్టర్ నగేష్

పారదర్శకంగా గురుకులాల టెండర్లు

మూడు కేటగిరీల్లో దరఖాస్తుల స్వీకరణ

22 వరకు పరిశీలన.. ఈ నెల 23న కేటాయింపు

మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్

మెదక్ అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం కొత్త టెండర్ విధానాన్ని తీసుకొచ్చిందని మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం టెండర్‌దారులు, డీపీసీ కమిటీ సమక్షంలో అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో టెండర్లను తెరిచారు. గతంలో మాదిరి కాకుండా ఈసారి జిల్లా, మండల స్థాయిలో మూడు కేటగిరీల్లో టెండర్లను విభజించామని పేర్కొన్నారు. కూరగాయాలు, పండ్లు కొనుగోలు కోసం మండస్థాయిలో చికెన్, మటన్ కోసం మండల స్థాయిలో ఒక యూనిట్‌గా ఎంపిక చేసి, టెండర్లకు ఆగస్టు 1న నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. ఈ నెల 14 వరకు దరఖాస్తులను స్వీకరించామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 54 పాఠశాలల్లో క్యాటరింగ్ 19, కూరగాయాలు 13, చికెన్, మటన్ 8 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ నెల 22 వరకు దరఖాస్తులను పరిశీలించి ఆగస్టు 23న అర్హులైన వారి పేర్లను ప్రకటిస్తామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు టెండర్ల పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. దరఖాస్తులను లాటరీ ద్వారా ఎంపిక చేస్తామని వివరించారు. ఈ విధానం ద్వారా కామన్ డైట్‌ను సమర్థవంతంగా, పకడ్బందీగా అమలు చేసేందుకు వీలుపడుతుందన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి, ఎస్సీ సంక్షేమశాఖ జిల్లా అధికారి విజయలక్ష్మి, డీపీసీ కమిటీ సభ్యులు, డీఆర్‌డీవో శ్రీనివాసరావు, డీవీహెచ్‌వో వెంకటయ్య, డీఈవో రాధాకిషన్ మైనార్టీ సంక్షేమశాఖ అధికారి జమ్లా నాయక్, వివిధ గురుకులాల కన్వీనర్లు పాల్గొన్నారు.

ఒక పంపుతో ఎన్నాళ్లు?

- అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి మొదలైన ఎత్తిపోతలు
- రోజుకు 0.33 టీఎంసీతో రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ నిండేదెన్నడు?
- జలకళ సంతరించుకోవాలంటే 32 టీఎంసీలు అవసరం
- మరో 3 మోటార్లు ఆన్ చేస్తేనే ప్రయోజనం
- లేదంటే 90 రోజుల పాటు ఎత్తిపోయాల్సిన పరిస్థితి

సిద్దిపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లోకి ఎట్టకేలకు నీటి ఎత్తిపోతలు ప్రారంభించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా మిడ్‌మానేరులో సరిపడా నీరు లేకపోవడంతో ఇదే జిల్లా ఇల్లంతకుంట మండలం అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి ఒక పంపు ద్వారా ఎత్తిపోత మొదలైంది. సోమవారం ఉదయం 11 గంటలకు రంగనాయకసాగర్‌లోకి ఎత్తిపోత ప్రారంభమైన నేపథ్యంలో నేటి ఉదయం 11 గంటల వరకు 0.33 టీఎంసీ నీళ్లు చేరనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ఒక పంపుతో 24గంటల పాటు నిరాటంకంగా ఎత్తిపోస్తే 0.33 టీఎంసీ మాత్రమే నీళ్లు చేరతాయి. ఈ లెక్కన 3 రోజుల పాటు ఎత్తిపోస్తేనే ఒక టీఎంసీని నింపొచ్చు. ప్రస్తుతం కాళేశ్వరం రిజర్వాయర్లయిన అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌లో 32 టీఎంసీలు అవసరం. ఈ 32 టీఎంసీలు నింపాలంటే ఒక పంపుతో 90 రోజుల సమయం పడుతుంది. అందుకే మిగతా 3 మోటార్లు ఆన్‌చేస్తే 20 రోజుల్లోనే రిజర్వాయర్లన్నీ జలకళను సంతరించుకుంటాయి. మిడ్‌మానేరుకు వరద ప్రవాహం పెరిగితే అన్నపూర్ణ మీదుగా మరో 2 మోటార్లయినా అదనంగా ప్రారంభిస్తే ఫలితం ఉంటుంది.

మల్లన్నసాగర్‌లోకి 30 టీఎంసీలు!

కాళేశ్వరం ప్రాజెక్టుకు గుండెకాయ వంటి సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని శ్రీకొమురవెల్లి మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లో గత ఏడాది 21 టీఎంసీలు నిల్వ చేశారు. యేటా కొంత సామర్థ్యాన్ని పెంచుతూ వస్తున్నారు. ఈసారి 30 టీఎంసీల వరకు నింపొచ్చని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం 10 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. ఈ లెక్కన మరో 20 టీఎంసీలను కేవలం మల్లన్నసాగర్‌లోకే ఎత్తిపోయాల్సి ఉంది. ఇక 15 టీఎంసీల సామర్థ్యం కలిగిన కొండపోచమ్మ సాగర్‌లో ప్రస్తుతం 4.8 టీఎంసీలు ఉండగా మరో 8 టీఎంసీలు ఎత్తిపోసే అవకాశం ఉంది. అదే విధంగా అన్నపూర్ణ, రంగనాయకసాగర్ రిజర్వాయర్లను పూర్తిగా నింపాల్సి ఉంటుంది.



అక్రమంగా తరలిస్తున్న గోవా మద్యం పట్టివేత

జహీరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గోవా నుంచి తెలంగాణకు అక్రమంగా తీసుకువస్తున్న మద్యాన్ని సోమవారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి ఎక్సైజ్ పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డిజిల్లా చిరాగ్‌పల్లి చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనఖీలను నిర్వహిస్తున్న క్రమంలో వివిధప్రాంతాలకు చెందిన పర్యాటకులు టూరిస్టు బస్సుల్లో వివిధరకాల బ్రాండ్‌ల పేరుతో ఉన్న మద్యాన్ని తీసుకువస్తున్నారు. టూరిస్టు బస్సుల్లో తనిఖీలుచేసి 74బాటిళ్లకుగాను 42లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధప్రాంతాలకు చెందిన నిషేధిత మద్యం తెలంగాణలోకి తీసుకువస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ఈ తనఖీల్లో సీఐ వీణారెడ్డి, ఎస్సైలు హన్మంతు, రమేష్, మురళీ, ఇబ్రాహీం, రాజ, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.



గురుకుల విద్యార్థుల ఒంటిపై దద్దుర్లు

●ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్న పిల్లలు, తల్లిదండ్రులు● 240 మందికి ఒకే మరుగుదొడ్డి

నారాయణఖేడ్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్‌లోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకులానికి అంటువ్యాధులు అలముకున్నాయి. గజ్జి, తామర, ఇతర వ్యాధులతో విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారు. దురదతో విద్యార్థుల చేతులు, శరీరంపై దద్దుర్లు వస్తున్నాయి. రెండు నెలలుగా ఈ దుస్థితి నెలకొన్నా ప్రిన్సిపాల్ పట్టించుకోవడం లేదు. పాపాన పోలేదు. గురుకులంలో పరిశుభ్రత లోపించడం, భవనాలు దుర్గంధం కొడుతుండడం, పరిసరాల అపరిశుభ్రతతో వ్యాధులు చుట్టుముట్టాయి. అంటు వ్యాధులు ప్రబలి పాఠశాల మొత్తం వ్యాప్తి చెందింది.





మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకులం

50 మంది ఇళ్లకు..

విద్యార్థులకు స్థానికంగా వ్యాధి నయం కాకపోవడంతో వారి తల్లిదండ్రులు బీదర్, హైదరాబాద్ పట్టణాల్లోని ఆస్పత్రుల్లో స్పెషలిస్టు వైద్యుల వద్ద పరీక్షలు చేయించి వేలాది రూపాయిలు ఖర్చు చేస్తున్నారు. కాస్త నయమై గురుకులానికి పంపించగానే తిరిగి అంటుకుంటున్నాయి. దాదాపు 50 మంది విద్యార్థులకు సోకడంతో ఇళ్లకు వెళ్లిపోయారు. గురుకులంలో చదువుతున్న మెజార్టీ విద్యార్థులు అనారోగ్య సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. తమ పిల్లలను చూసేందుకు వెళ్లిన తల్లిదండ్రులు, బంధువులను ప్రిన్సిపాల్ కలవనివ్వకపోవడం, గద్దించి పంపించడంతో వ్యాధి తీవ్రతరమైందని, పరిస్థితి చేయిదాటాక పిల్లలను గృహాలకు పంపిస్తున్నాడని వాపోయారు.

240 మందికి ఒకే మరుగుదొడ్డి..

గురుకులంలో రెండు భవనాలు ఉన్నాయి. ఒక భవనంలో 5,6,7వ తరగతి విద్యార్థులు చదువుతూ నివాసం ఉంటున్నారు. మూడు తరగతులకు కలిపి 240 మంది విద్యార్థులకు ఐదు మరుగుదొడ్లు ఉండగా, నాలుగు చెడిపోయాయి. ఒక్క మరుగుదొడ్డిలోనే 240 మంది విద్యార్థులు నిత్యం వెళ్లాల్సి వస్తుంది. మరో భవనంలో 8, 9, 10వ తరగతులకు కలిపి 240 మందికి గాను మూడు మరుగుదొడ్లు ఉండగా ఒకటి ఉపాధ్యాయులు, రెండింటినే విద్యార్థులు వినియోగించుకుంటున్నారు.

విష జ్వరాలు సోకుతుంటే.. ప్రభుత్వానికి సోయిలేదు

● మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు


పుల్‌కల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో విష జ్వరాలు ప్రబలుతుంటే ప్రభుత్వానికి సోయిలేకుండా పోయిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ధ్వజ మెత్తారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం సింగూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులు అస్వస్థతకు గురైతే వారికి నాణ్యమైన వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. అధికార యంత్రాంగం ఏం చేస్తున్నదని మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యతును బంగారు మయం చేస్తానంటూ ఉపన్యాసాలు దంచికొట్టే సీఎం రేవంత్‌రెడ్డికి గురుకుల పాఠశాల విద్యార్థుల అవస్థలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాల్లో విష జ్వరాలు ప్రబలుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు తెగిపోవడానికి కారకులైన వ్యక్తులపై కేసు

శివ్వంపేట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): చేపల కోసం ఇనుప కంచతో వరద నీటిని వెళ్లకుండా చేసి రెండువైపులా రహదారి తెగిపోవడానికి కారకులైన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని వెల్దుర్తి ఉసిరిక పల్లి రోడ్డు పోతుల బోగుడ కల్వర్టు వద్ద పోతులబోగుడ చెరువులో చేపలు వరద నీటిలో వెళ్లకుండా ముగ్గురు వ్యక్తులు ఇనుప జాలి ఏర్పాటు చేశారు. దీంతో వరద నీరు సాఫీగా వెళ్లకుండా రోడ్డు పూర్తిగా కొట్టుకపోవడంతో రోడ్డు తెగిపోయింది. దీనికి కారకులైన చేరిల్ల దశరథం, ప్రవీణ్, శేఖర్‌ల పై ఇరిగేషన్ ఏఈ మహేష్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుకర్ తెలిపారు.

హత్య కేసులో దోషికి జీవిత ఖైదు

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో దోషికి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.3వేలు జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీ చంద్ర సోమవారం తీర్పు చెప్పారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్ జిల్లా లాహోర్ తాలూకాకు చెందిన సంజయ్ లక్ష్మణ్ కాంబ్లే అలియాస్ అలియాస్ సంజు కాంబ్లే (38), అదే తాలూకాకు చెందిన ఉత్తమ రామ యాడ్కేలు తోడల్లుళ్లు. వీరిద్దరూ సంగారెడ్డిలో కూలీ పనిచేసుకుంటూ జీవించే వారు. ఇంట్లో ఖర్చులకు డబ్బులు ఇవ్వడం లేదన్న కోపంతో రామ యాడ్కేను సంజయ్ లక్ష్మణ్ 2020 జూలై 5న సంగారెడ్డిలోని కొత్తబస్టాండ్ వద్ద బండరాయితో తలపై కొట్టి హత్య చేశాడు. ఈ మేరకు పోలీసు అధికారులు రమేష్, వెంకటేశంలు పూర్తి ఆధారాలను కోర్టులో సమర్పించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు సంజయ్ లక్ష్మణ్ (38)కి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధించారు







గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

జగదేవ్‌పూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, జగదేవ్‌పూర్ ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. జగదేవ్‌పూర్, గొల్లపల్లి మధ్యలోని కెనాల్ వద్ద బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని పట్టుకొని తనిఖీ చేయగా 700 గ్రాముల ఎండు గంజాయి లభించినట్లు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా జగదేవ్‌పూర్ మండలంలోని వట్టిపల్లి గ్రామానికి చెందిన గంగాపురం భానుప్రసాద్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మన్యం ప్రాంతం నుంచి గంజాయిని తీసుకువచ్చి హైదరాబాద్‌లో విక్రయించడానికి తీసుకువెళ్తున్నట్లు చెప్పారు. గంజాయితో పాటు బైక్, మొబైల్ స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం గజ్వేల్ కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

గ్యాస్ లీక్ ఘటనలో మరొకరు మృతి

ఝరాసంగం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా ఏడాకులపల్లి గ్రామంలో ఈనెల 6న గ్యాస్ సిలిండర్ లీకైన ఘటనలో గాయాలకు గురై సోమవారం నాటికి ముగ్గురు మృతిచెందారు. ఈనెల 8న తల్లి గొర్రెకంటి శంకరమ్మ(65), ఈనెల 15న కుమారుడు గొర్రెకంటి ప్రభు(38)మృతిచెందాడు. మరోకుమారుడు గొర్రెకంటి విఠల్(30) సోమవారం ఉదయం పటాన్‌చెరులో చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఇప్పటివరకు ఆదుకున్న నాథుడే లేడని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



చికిత్సపొందుతూ మృతి చెందిన విఠల్(ఫైల్)

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ దుర్మరణం


●కుమారుడి కళ్ల ముందే ఘటన

పటాన్‌చెరు ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అడ్డామీద కూలీ పని దొరక్క కుమారుడితో మోటారు సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని కుమారుడి కళ్ల ముందే తల్లి దుర్మరణం పాలయింది.చనిపోయిన తల్లిని ఎక్కడికి ఎలా తీసుకువెళ్లాలో దిక్కుతోచని స్థితిలో ఆ కుమారుడు పడిపోయాడు. చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలు. ఎస్సై సుభాష్ కథనం ప్రకారం.. నిజాంపేట మండలం బాచేపల్లిలో భర్త సాయిలు చనిపోవడంతో కుమారుడు పరమేష్‌తో సంతోష (48) నివాసం ఉంటున్నారు. అడ్డామీద కూలీగా పనిచేస్తున్నారు.. ఇస్నాపూర్‌లో కూలీ ఎక్కువగా వస్తుందని మోటారు సైకిల్‌పై ఆదివారం వచ్చారు. సోమవారం మధ్యాహ్నం వరకు అడ్డా మీద నిలబడ్డారు. వర్షాలు పడుతుండటంతో కూలీ పని చేయించుకోవడానికి ఎవరూ పిలవలేదు. పని దొరక్కపోవడంతో తల్లి కుమారుడు కలిసి మోటారుసైకిల్‌పై సోమవారం మధ్యాహ్నం సమయంలో ప్రయాణం అయ్యారు. లక్దారం గ్రామ ముఖద్వారం సమీపంలో సంగారెడ్డి డిపోకు చెందిన పిట్లంకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుకనుంచి ఢీకొట్టింది. దీంతో వెనుక కూర్చున్న తల్లి సంతోష బస్సు వెనుక టైర్ కింద పడింది. ఆమె తలపైభాగం నుంచి టైర్ ఎక్కడంతో తలపగిలి మెదడు భాగం బయటకు వచ్చి అక్కడికక్కడే దుర్మరణం పాలయింది. కళ్ల ముందే చనిపోయిన తల్లిని చూసిన కుమారుడు పరమేష్ రోదిస్తూ రోడ్డుపై అలానే ఉండి పోయిన దృశ్యాలు చూపరులకు కంటతడి పెట్టించాయి. కుమారుడు పరమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



వరకట్న వేధింపులతో మహిళ ఆత్మహత్య

హవేళిఘణపూర్, ఆగస్టు 18; (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులు తట్టుకోలేక మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. భూర్గుపల్లి గ్రామానికి చెందిన ఇండ్ల నవ్య(23)కు నరేష్‌తో 2023లో వివాహం జరిగింది. నవ్య తల్లిగారి గ్రామం కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం ఆర్గొండ గ్రామం. ఐదు తులాల బంగారం, లక్ష నగదు, ఇతర లాంఛనాలతో ఘనంగా వివాహం చేశారు. కొన్ని రోజుల నుంచి భర్త, అత్తమామలు అదనపు కట్నం తీసుకురావాలని వేధింపులకు గురి చేయగా కొంత డబ్బులు పంపించారు. గతంలో వేధింపుల గురించి గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించారు. మళ్లీ డబ్బులు కావాలని వేధించేసరికి ఈ వేధింపులు తప్పేటట్లు లేవని మనస్తాపంతో శనివారం రాత్రి ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త కిందికి దింపి మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరిలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతురాలి తండ్రి పోచయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎసై నరేష్ తెలిపారు.


అనంతసాగర్ నుంచి రంగనాయకసాగర్‌లోకి డెలివరీ సిస్టర్న్ ద్వారా పారుతున్న గోదావరి జలాలు


సింగూరు ప్రాజెక్టు గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు


అల్లాదుర్గంలోని బట్టికుంట కట్టకు పడిన గండి

దంచికొట్టింది

ఉమ్మడి మెదక్ జిల్లాలో వర్షం దంచికొట్టింది. సంగారెడ్డి జిల్లాలో కాస్త పర్వాలేదనిపించినా సిద్దిపేట, మెదక్ జిల్లాలో అయితే విజృంభించాడు. వరుణుడి ఉగ్రతాండవంతో వాగులు, వంకలు, చెరువులు, కుంటలతో పాటు ప్రాజెక్టులకు వరద పోటెత్తింది. ఎటుచూసినా జలపరవళ్లు కనిపిస్తున్నాయి. చెరువులు మత్తళ్లు దూకుతుండగా, వాగులు పొంగిపొర్లుతున్నాయి. ప్రాజెక్టులు ఉప్పొంగుతున్నాయి. రోడ్లు దెబ్బతినగా, అక్కడక్కడ ఇళ్లు కూలిపోయాయి.


ఉధృతంగా ప్రవహిస్తున్న కూడవెల్లి వాగు


పెద్దశంకరంపేట మండలంలో పొంగి పొర్లుతున్న రామోజీపల్లి చెరువు



తూప్రాన్ గాయత్రీ నగర్ నుంచి ప్రజలను బయటకు తీసుకువస్తున్న ఎక్స్‌కవేటర్, వర్గల్ మండలం అంబర్‌పేటలో నీటమునిగిన ట్రాక్టర్


వర్గల్ మండలంలోని నాచగిరి క్షేత్రం వద్ద ఉధృతంగా పారుతున్న హరిద్ర నది


అల్లాదుర్గం మండలం చిల్వెర్ పాఠశాల ఆవరణలో నిలిచిన నీరు.



ఏడుపాయల ఉప్పొంగి ప్రవహిస్తున్న మంజీర నది, పాపన్నపేట మండలం తెల్లాపూర్ వద్ద మంజీర ప్రవహ ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్


మిరుదొడ్డి మండలం అల్వాల్ వద్ద కూడవెల్లి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న సిద్దిపేట సీపీ అనురాధ


హత్నూర మండలం ఎల్లమ్మగూడా గ్రామ శివారులో వరద నీటితో కోళ్లఫామ్‌లో మృతి చెందిన కోళ్లు



వర్గల్‌లో ఉధృతంగా ప్రవహిస్తున్న చెరువులు, చెక్‌డ్యాంల వైపు వెళ్లకుండా ఏర్పాటు చేసిన బారికేడ్లు



మాసాయిపేట మండలంలోని హక్కింపేట వద్ద అలుగు పారుతున్న హల్దీ, సిర్గాపూర్ మండలంలోని అలుగుపారుతున్న నల్లవాగు ప్రాజెక్టు


అల్లాదుర్గంలో వరద నీటితో కొట్టుకుపోయిన బైక్‌ను తీసుకువస్తున్న రైతులు

ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలి

● ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఈడీ ఖుస్రోషాఖాన్


ఖేడ్ డిపోలో ఖుస్రోషాఖాన్

నారాయణఖేడ్/మెదక్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఈడీ ఖుస్రోషాఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన మెదక్, నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్యారేజ్, డీఎం కార్యాలయాన్ని తనిఖీ చేసి వివిధ రికార్డులను పరిశీలించారు. డిపోల్లోని బస్సులు, రోజు తిరుగుతున్న కిలోమీటర్లు, ఆదాయం, సిబ్బంది వివరాలు, మహాలక్ష్మి ద్వారా ఉచిత ప్రయాణ వివరాలు స్థానిక డీఎంలను అడిగి తెలుసుకున్నారు. మెదక్ రీజియన్ మేనేజర్ విజయబాస్కర్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఎస్‌హెచ్‌కే మూర్తి, హైదరాబాద్ జోన్ డిప్యూటీ సీటీఎం శ్రీనివాస్, ఆయా డిపోల అధికారులు ఉన్నారు.

ప్రీ ప్రైమరీ విద్యను అంగన్‌వాడీల్లో నిర్వహించాలి

● పేస్ క్యాప్చర్ హాజరును రద్దు చేయాలి
● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలంటే ప్రీ ప్రైమరీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే కొనసాగించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సోమవారం సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలస్వామి మాట్లాడుతూ సిగ్నల్ సమస్యల వల్ల పిల్లల పేస్ క్యాప్చర్ హాజరు నమోదు చేయడం ఇబ్బందిగా మారిందని, వెంటనే రద్దు చేయాలని కోరారు. నూతన జాతీయ విద్యా విధానం ఐసీడీఎస్, విద్యా వ్యవస్థలను నిర్వీర్యం చేసేలా ఉందని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం నిలబడి అంగన్‌వాడీ వ్యవస్థను రక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని సూచించారు. అనంతరం వారు కలెక్టరేట్ కార్యాలయంలో ఏవో రెహ్మాన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్, సహాయ కార్యదర్శి రవికుమార్, అంగన్‌వాడీ నాయకురాళ్లు పద్మ, లక్ష్మి, భూలక్ష్మి, సురేఖ, విజయ, అంజలి, అనిత, నాగరాణి, వసంత, ప్రేమలత, కళావతి తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల ఆర్థిక స్థితిపై సర్వే

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయేతర, చిరు వ్యాపారాలు చేసుకునే వారి ఆర్థిక పరిస్థితిని తెలుసుకోవడానికి కేంద్ర గణాంక మంత్రిత్వ శాఖ సర్వే చేపట్టింది. ఇందులో భాగంగా సోమవారం జాతీయ గణాంక శాఖ ప్రధాన కార్యాలయ అధికారులు గోవర్ధన శ్రీనివాసరావు, గుర్రం శ్రీనివాస్‌గౌడ్, ఆరె లక్ష్మీనారాయణ మెదక్ పట్టణంలో పర్యటించారు. మున్సిపల్ అధికారులతో కలిసి ప్రధాన వ్యాపార కేంద్రాలు, రోడ్లపై వ్యాపారం చేసుకునే వారితో మాట్లాడారు. వారి ఆర్థిక పరిస్థితి, పనితీరు వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరెడ్డి, టీపీవో భూపతి, ఎంపీఎస్‌వో మహేందర్‌రెడ్డి, వార్డు అధికారులు పాల్గొన్నారు.

అపురూప దృశ్యాలు

నేడు ఫొటోగ్రఫీ దినోత్సవం





రేకెత్తిస్తూ మోడువారిన వృక్షం నిశ్చలంగా నిలబడగా చీకటి మేఘాలను చీల్చుతూ కాంతి రేఖ.. నీలాకాశంలో రెక్కలు విప్పుకుంటూ స్వేచ్ఛగా ఎగురుతున్న పక్షి.. పచ్చని పొలంలో రంగుల హొయలతో విహరిస్తున్న నెమలి.. ఎంతో శ్రద్ధగా గూడును అల్లుకుంటున్న విహంగం.. ఈ చిత్రాలు ఒక దృశ్యకావ్యంలా మన కళ్లముందు సాక్షాత్కరిస్తున్నాయి. ఈ అపురూప దృశ్యాలు సృష్టిలోని అద్భుతానికి నిదర్శనం. క్షణాలను శాశ్వతం చేస్తూ, భావోద్వేగాలను బంధిస్తూ, ప్రకృతి ఒడిలోని అందాలను మనకు అందిస్తున్న ఫొటోగ్రఫీ గొప్పతనాన్ని తార్కాణాలు..

- సంగారెడ్డి జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్




ఏసీబీ నిఘా.. అధికారులకు తగలని సెగ

● గత నెల సదాశివపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై దాడులు
● గతంలో పట్టుబడిన మున్సిపల్ సిబ్బంది
● అయినా.. లంచావతారుల్లో రాని మార్పు

సదాశివపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : సదాశివపేటలోని ప్రభుత్వ కార్యాలయాలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిఘా పెట్టారు. అవినీతి, అక్రమాలకు అడ్డాగా మారిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై మెరుపు దాడులు చేశారు. అయితే, గతంలోనూ ప్రభుత్వ శాఖల్లో అనేక దాడులు జరిగినా అధికారుల తీరు మాత్రం మారలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏసీబీ దాడుల్లో బయటపడ్డ నిజాలు

జూలై 17న ఏసీబీ డీఎస్పీ సుదర్శన్, ఇతర అధికారులు సదాశివపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై దాడి చేశారు. ఈ తనిఖీల్లో 39 డాక్యుమెంట్లు లభ్యమయ్యాయి. ఆశ్చర్యకరంగా, ఈ డాక్యుమెంట్లలో దరఖాస్తుదారుల ఫోన్ నంబర్లకు బదులుగా ప్రైవేటు డాక్యుమెంట్ రైటర్ల ఫోన్ నంబర్లు ఉన్నాయి. దీనిపై ఏసీబీ అధికారులు సమగ్ర విచారణ జరుపుతున్నారు. ఈ తనిఖీల్లో కేవలం రూ.5,500 మాత్రమే లభ్యం కావడం విచిత్రంగా మారింది. ఈ మొత్తం ఎవరిదనేది ప్రశ్నార్థకంగా మిగిలింది. రోజుకు లక్షల్లో లంచాలు తీసుకుంటారనే ఆరోపణలు ఉన్న నేపథ్యంలో, పట్టుబడకుండా ఉండేందుకు లంచాల డబ్బును పారవేసి ఉంటారని అనుమానిస్తున్నారు. ఏసీబీ ట్రాప్ చేసిన డబ్బు కావచ్చునని భయపడి పారవేసి ఉంటారని కూడా ప్రచారం జరుగుతోంది. చాలా చోట్ల ఏసీబీ దాడుల్లో పట్టుబడిన వ్యక్తులు గులాబీ రంగు చేతులతో దొరికిన ఘటనలు గుర్తు చేసుకుని, డబ్బును తాకకుండా పారవేసి ఉంటారని తెలుస్తోంది. ఏసీబీ దాడుల నేపథ్యంలో అధికారులు ఎలా తప్పించుకోవాలనే ఆలోచిస్తున్నారే తప్ప, లంచాలు తీసుకోవడం మాత్రం ఆపడం లేదు.


సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు (ఫైల్)

ముఖ్య అధికారిపైనే ఏసీబీ నజర్

ఈ దాడుల వెనుక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని ఓ ముఖ్య అధికారి ఉన్నారని ప్రచారం జరుగుతోంది. ఒక వెంచర్ యజమాని నుండి పెద్దమొత్తంలో లంచం డిమాండ్ చేయడంతో, బాధితులు ఏసీబీకి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. లంచం ఇస్తేనే ఫైళ్లు కదులుతాయని ఆ అధికారి చెప్పినట్టు ఆరోపణలు ఉన్నాయి. పట్టుబడిన రూ.5,500 కూడా ఆ అధికారివేనని సిబ్బంది గుసగుసలాడుకుంటున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలను ధిక్కరించి, బదిలీ అయినా కూడా అదే కార్యాలయానికి తిరిగి వచ్చారని, ఈ విషయం కూడా ఏసీబీ దృష్టిలో ఉందని సమాచారం.

పరిస్థితి మారడం లేదు

సదాశివపేటలో లంచం ఇవ్వకపోతే పనులు జరగని ప్రభుత్వ శాఖలు అనేకం ఉన్నాయి. గతంలోనూ మున్సిపల్ కార్యాలయంపై ఏసీబీ దాడులు జరిగాయి. 2005, 2013-14, 2018 సంవత్సరాల్లో మున్సిపల్ ఇంజనీర్, టీపీవో, ఇతర సిబ్బందిని ఏసీబీ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. 2024 జనవరిలో ఇంటి నంబర్ కేటాయింపు కోసం లంచం తీసుకుంటున్న మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని ఏసీబీ పట్టుకుంది. ఇంత జరిగినా లంచాల భాగోతం కొనసాగుతూనే ఉంది. ఏసీబీ దాడులు చేసినా కూడా అధికారులు, సిబ్బంది తీరు మారడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎరువులు జిల్లా సరిహద్దులు దాటొద్దు

సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఒక్క ఎరువు బస్తా కూడా అక్రమంగా జిల్లా సరిహద్దులు దాటి వెళ్లకుండా గట్టి నిఘా కొనసాగించాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, సీఎస్ రామకృష్ణారావు ఇతర అధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి సోమవారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆమె కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ అన్ని సహకార సంఘాలలో ఎరువుల నిల్వలు అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. సొసైటీలలో ఎరువుల స్టాక్‌ను పరిశీలించాలని, ప్రైవేట్ విక్రయ కేంద్రాలను మండల వ్యవసాయ అధికారులు తప్పనిసరిగా తనిఖీ చేసేలా చూడాలన్నారు. ఎక్కడైనా ఎరువుల విక్రయాల్లో అవకతవకలకు పాల్పడడం, బ్లాక్ మార్కెట్‌కు తరలించడం, నిర్ణీత ధర కంటే ఎక్కువ ధరకు విక్రయించడం, ఎరువులను పక్కదారి పట్టించడం వంటివి గుర్తిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

పరిహారం స్థలాలకు పొజిషన్ చూపాలి

● సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్యకు రైతుల వినతి

జిన్నారం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎండీఏ లే అవుట్ కోసం భూములు ఇచ్చిన తమకు పరిహారంగా ఇచ్చిన స్థలాలకు వెంటనే పొజిషన్లు చూపాలని జిన్నారం, జంగంపేట గ్రామాలకు చెందిన రైతులు జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కోరారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. రెండు గ్రామాల్లోని 180 ఎకరాల అసైన్డ్ భూములను హెచ్‌ఎండీఏ ల్యాండ్ పూలింగ్ కింద సేకరించిందని రైతులు తెలిపారు. భూములు ఇచ్చిన రైతులకు ఎకరాకు 600 గజాల చొప్పున స్థలం కేటాయించి పట్టాలు ఇచ్చారని, అయితే మూడేళ్లు గడిచినా స్థలాలకు పొజిషన్లు చూపలేదని, లే అవుట్ పనులు కూడా ప్రారంభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ, హెచ్‌ఎండీఏ శాఖల నిర్లక్ష్యం వల్ల తాము నష్టపోతున్నామని రైతులు కలెక్టర్‌కు వివరించారు. జిన్నారం అక్కమ్మ చెరువు వరద కాలువను ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని రైతులు, నాయకులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్థానిక కొచెరువు నుంచి చెరువులోకి వచ్చే వరద కాలువను పూడ్చివేసి నిర్మాణాలు చేపడుతున్నారని, దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, నిఖిల్, బ్రహ్మేందర్‌గౌడ్, విఠల్, పోచయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రాపురంలో రైల్వే బోర్డు మాజీ చైర్మన్ పర్యటన

రామచంద్రాపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర రైల్వే బోర్డు మాజీ చైర్మన్ కృష్ణదాస్ సోమవారం రామచంద్రాపురంలోని ఎమ్మెల్సీ అంజిరెడ్డి నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, ఇతర నేతలు ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ముత్తిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రామకృష్ణ, రాజు, రాథోడ్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలి

- ఎమ్మెల్యే సునీతారెడ్డి
- వరద ప్రాంతాల్లో అధికారుల పర్యటన

నర్సాపూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు పడుతున్నందున నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు అత్యవసరముంటే తప్పా బయటకు వెళ్లొద్దని ఎమ్మెల్యే సునీతారెడ్డి సూచించారు. నర్సాపూర్‌లోని రాయరావు చెరువును సందర్శించి కట్టమీద అమ్మవారి పూజలు నిర్వహించి చెరువును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్, పట్టణ అధ్యక్షుడు బిక్షపతి, మాజీ ఎంపీటీసీ సత్యంగౌడ్, మాజీ కౌన్సిలర్ బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

●చిలప్‌చెడ్ : భారీగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని చిట్కుల్ చాముండేశ్వరి వంతెనను, బద్రుతండాలో గల పోతని కుంటలను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ సహదేవ్, ఎంపీడీవో ప్రశాంత్, ప్రత్యేకాధికారి నిత్యానంద, ఎస్ఐ నర్సింహులు ఉన్నారు.

●మెదక్ మున్సిపాలిటీ: మరో రెండురోజులు భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సోమవారం ప్రకటనలో సూచించారు.

●రేగోడు : రేగోడు మండలంలోని కొండాపూర్-జగిర్యాల చెరువు అలుగు నుంచి ప్రవహిస్తున్న నీటిని మెదక్ ఆర్డీవో రమాదేవి సోమవారం పరిశీలించారు. ఆమెవెంట తహసీల్దార్ దత్తారెడ్డి, ఆర్ఐ ఫిరోజ్ తదితరులు ఉన్నారు. అలాగే మండలంలోని దోసపల్లి, గజవాడ, పోచారం గ్రామాల్లో పత్తి పంటలను వ్యవసాయ అధికారి జావిద్ పరిశీలించారు.

●నిజాంపేట: నిజాంపేట మండల పరిధిలోని నందిగామ, వెంకటాపూర్, చల్మెడ, నార్లాపూర్ గ్రామాల్లోని కల్వర్టులు, వాగులు, చెరువులను మండల ప్రత్యేకాధికారి దేవ్‌కుమార్ సోమవారం పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాజిరెడ్డి, ఆర్ఐ ఇమద్, పంచాయితీ కార్యదర్శులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

●గుమ్మడిదల: గుమ్మడిదల మండలంలోని వివిధ పంటల పొలాలను మండల వ్యవసాయ అధికారి పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏఈవో నిఖిత ఉన్నారు.

●నాగల్‌గిద్ద : నాగల్‌గిద్ద మండల పరిధిలోని శాపూర్, మంజీరా పరీవాహక ప్రాంతాన్ని తహసీల్దార్ శివక్రిష్ణ ఎంపీడీవో, ఎస్ఐతో కలిసి పరిశీలించారు.

●అల్లాదుర్గం : మండలంలోని రాంపూర్, సీతానగర్, రెడ్డిపల్లి, అల్లాదుర్గం తదితర గ్రామాల్లో దెబ్బతిన పంటలను మండల వ్యవసాయ అధికారి రాజేష్‌కుమార్ ఏఈవో నవీన్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు.

●చిన్నశంకరంపేట : చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని పురాతన ఇళ్లను ఎంపీడీవో దామోదర్ సోమవారం పరిశీలించారు. బాధితులకు పలు సూచనలు కల్పించారు. ఆయన వెంట ఈవో ప్రదీప్ ఉన్నారు.



చాముండేశ్వరి ఆలయ సమీపంలోని మంజీరానది వంతెనను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్



రేగోడు మండలం కొండాపూర్-జగిర్యాల చెరువును పరిశీలిస్తున్న మెదక్ ఆర్డీవో రమాదేవి



నాగల్‌గిద్ద: శాపూర్ శివారులో గల మంజీరా పరీవాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్ఐ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

(5వ పేజీ తరువాయి)

పదేళ్ల నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. సింగూరు డ్యాం భద్రతపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సింగూరు డ్యాంకు శాశ్వత మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం ఎంతటి ఖర్చుకైనా సిద్ధంగా ఉందని తెలిపారు. సింగూర్ డ్యాం పరిరక్షణకు దేశంలో అత్యున్నతస్థాయిలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించేందుకు అవసరమైన డీఆర్‌పీలను సిద్ధం చేయాలనీ మంత్రి దామోదర్ అధికారులను ఆదేశించారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం శర వేగంగా జరుగుతుందని హౌసింగ్ శాఖ అధికారులు మంత్రికి వివరించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లను వెంటనే యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తు పనులు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. అంగన్వాడి భవనాల నిర్మాణం, పరమత్తులు, గ్రామపంచాయతీ భవనాలు, ప్రాథమిక ఆరోగ్య భవనాల నిర్మాణాలను, ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన పనులు మరమ్మత్తులు వెంటనే పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. సెప్టెంబర్ లోగా నర్సింగ్ కళాశాల పనులు పూర్తి చేయాలని నిర్దేశించారు.

ఎరువుల కొరత రాకుండా చూడాలి

జిల్లాలో ఎక్కడ కూడా ఎరువుల కొడతా రాకుండా వ్యవసాయ శాఖ మార్కెటింగ్ మార్క్ఫెడ్ శాఖల అధికారులు అవసరమైన అన్ని జాగ్రత్తలు చేపట్టాలని దామోదర్ ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు ఏఈవోలు ఏవోలు ప్రతిరోజు తమ పరిధిలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తూ ఎరువులు పక్కదారి పట్టకుండా అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో పాటు వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలగవద్దు

నర్సాపూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం భారీ వర్షాలు ఎడతెరపి లేకుండా పడుతున్నందున నర్సాపూర్ నియోజకవర్గంలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని స్థానిక అధికారులకు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్‌రాజనర్సింహ సూచించారు. సోమవారం నర్సాపూర్‌లో ఆర్డీవో మహిపాల్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌లతో నియోజకవర్గంలో వర్షం పరిస్థితిపై చర్చించారు. ప్రజలకు ఇబ్బంది కల్గకుండా జాగ్రతలు తీసుకోవాలని సూచించి వెళ్లారు.

వ్యాధులు వ్యాప్తి చెందకుండా చూడండి

- అధికారుల సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భారీ వర్షాలు కారణంగా చెరువులు, కుంటలు పూర్తిగా నిండిపోయాయని, మురుగునీరు నిల్వ ఉండకుండా అధికారుల చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. సోమవారం ప్రజావాణి ముగిసిన అనంతరం వివిధశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో భారీ వర్షాలు పడినందున గ్రామాల్లో ఎక్కడా నీరు నిలవకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీ రాజ్ సిబ్బంది అప్రమత్తతో వ్యవహరించాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు.

గ్రామాల్లో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి

చిన్నశంకరంపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల నేపథ్యంలో గ్రామాల్లోని ప్రజలకు సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య అన్నారు. సోమవారం చిన్నశంకరంపేట ఎంపీపీ కార్యాలయంలో కార్యాలయ సిబ్బందికి అత్యవస సమావేశాన్ని ఏర్పాటుచేసి మాట్లాడారు. ప్రజలు ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువల వద్దకు వెళ్లొద్దన్నారు. రైతులు వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్ మరమ్మతులు చేపట్టొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి డాక్టర్ వెంకటయ్య, ఎంపీడీవో దామోదర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నశంకరంపేట : ఎంపీపీ కార్యాలయంలో కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో ఎల్లయ్య

మెతుకుసీమ అతలాకుతలం

(5వ పేజీ తరువాయి)

మండలం కొప్పోల్ ఉమాసంగమేశ్వరస్వామి ఆలయంలో కాశీబుగ్గ పొంగిపొర్లడంతో భక్తులు పూజలు జరిపారు. శివంపేటలోని కొదండరామాలయం నీట మునిగింది. మాసాయిపేట మండలంలోని హకీంపేట హల్దీ ప్రాజక్ట్ నిండుకుండను తలపిస్తోంది. వెల్దుర్తి మండల పరిధిలోని ఉప్పులింగాపూర్‌లో ఉధృతంగా ప్రవహిస్తున్న హల్దీవాగును జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. శివంపేట మండలం పిల్లుట్ల గ్రామస్థులు దప్పు చెరువు నిండటంతో గంగమ్మకు పూజలు నిర్వహించారు. పొతులబోగుడ రోడ్డు ధ్వంసం కావడంతో ఎమ్మెల్యే సునీతారెడ్డి పరిశీలించారు. నర్సాపూర్ చెరువుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. చిట్కుల్ గ్రామ శివారులోని చాముండేశ్వరీ ఆలయం వద్ద మంజీరా నదిపై గల వంతెనను అదనపు కలెక్టర్ నగేష్ పరిశీలించారు. చిన్నశంకరంపేట మండలం దర్పల్లి శివారులో నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద వర్షం కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లను ప్రత్యేకాధికారి, ఇరిగేషన్ అధికారులు పర్యవేక్షించారు. పాపన్నపేట మండలం ఎల్లాపూర్ వద్ద మంజీరా ఉధృతంగా పరవళ్లు తొక్కుతుండడంతో వంతెన వద్ద పరిస్థితిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కౌడిపల్లి మండలం జాజి తండా-రాజిపేట్ మధ్య రామలక్ష్మణ వాగు పొంగిపొర్లడంతో రాకపోకలు నిలిచి పోయాయి.

పులిమామిడిరాజుకు బండా ప్రకాష్ పరామర్శ



పులిమామిడి భాగమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ తదితరులు

సదాశివపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ముదిరాజ్ సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పులిమామిడి రాజును తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ సోమవారం పరామర్శించారు. పులిమామిడిరాజు మాతృమూర్తి భాగమ్మ ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. భాగమ్మ చిత్రపటానికి బండా ప్రకాష్ పూలమాలవేసి నివాళులర్పించి, రాజు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పట్నం మాణిక్యం, మామిళ్ల రాజేందర్, నారాయణ తదితరులు ఉన్నారు.

రాయరావు చెరువుకు ప్రత్యేక పూజలు

నర్సాపూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ రాయరావు చెరువు పూర్తిగా నిండి అలుగు పారుతున్నది. సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో చెరువు వద్ద గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి హారతి పట్టారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్, సీనియర్ నాయకులు పెద్ద రమేష్‌గౌడ్, దిగంబర్, జిల్లా ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి, రాజేందర్, ఎస్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాములనాయక్, పట్టణ అధ్యక్షుడు చంద్రయ పాల్గొన్నారు.

జహాజ్ వదిలిన కాంగ్రెస్ మైనారిటీ నాయకులు

నర్సాపూర్ రాయరావు చెరువు నిండుగా నిండి అలుగుపారిన సందర్భంగా కాంగ్రెస్ మైనారిటీ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో చెరువులో జహాజ్(తెప్ప వదలడం) వదిలే కార్యక్రమాన్ని ఇనాందార్‌ఖాజీ రియాజోద్దిన్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రిజ్వాన్, మైనార్టీ కాంగ్రెస్ అధ్యక్షులు అజ్మత్, మాజీ వార్డు సభ్యులు రషిద్, నాయకులు రసన్, రవి,రవిశంకర్, దిల్షాద్‌ఖాన్, సాదత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

జహీరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మహేష్, ఎంఈవో జాఫర్‌అలీ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన మొగుడంపల్లిలో గల ఎస్టీ గురుకుల పాఠశాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. పాఠశాలలో తిరుగుతూ విద్యార్థులు బాగోగులను తెలుసుకున్నారు. అధికారులు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నారా, ఏయే సమయాల్లో ఏ రకమైన ఆహారాన్ని ఇస్తున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడద తీర్చండి

- మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పరిధిలో కోతుల బెడద తీర్చాలని మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్ కోరారు. గత రెండు, మూడురోజులుగా తమ కాలనీలో కోతులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రభవన్ కాలనీలో రెండురోజుల క్రితం ఓ బాలికపై కోతులు తీవ్రంగా దాడిచేశాయని గుర్తుచేశారు. పిల్లలు బయటకు వెళ్లాలంటే జంకుతున్నారన్నారు. ఇప్పటికే పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమన్నారు. పట్టణంలో సంచరిస్తున్న కోతులను ఇక్కడి నుంచి అటవీ ప్రాంతాలకు తరలించాలని సోమవారం ఒక ప్రకటనలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని డిమాండ్ చేశారు.

ఖేడ్‌లో విరగబూసిన బ్రహ్మ కమలాలు

నారాయణఖేడ్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : హిమాలయాల్లో మాత్రమే కనిపించే అరుదైన బ్రహ్మకమలాలు సోమవారం తెల్లవారుజామున నారాయణఖేడ్ పట్టణానికి చెందిన తానాజా, సునీతల గృహంలో విరగబూశాయి. ఒకే చెట్టుకు ఆరు పువ్వులు పూయడంతో వారు భక్తిశ్రద్ధలతో పూజించారు. అంతేకాకుండా రుద్రారం గ్రామానికి చెందిన శ్రీహరి, క్రిష్ణాగౌడ్ ఇళ్లల్లోనూ బ్రహ్మకమలాలు పూయడంతో వారూ పూజలు చేశారు.



ఖేడ్‌లోని తానాజీ గృహంలో విరగబూసిన బ్రహ్మకమలాలు

చేపల చెరువులను పరిశీలించిన అధికారులు

వట్‌పల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఖాదీరాబాద్‌లో అక్రమంగా నిర్వహిస్తున్న చేపల చెరువులను తహసీల్దార్ చంద్రశేఖర్, ఇరిగేషన్ ఈఈ నిషిత, ఎస్ఐ లవకుమార్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా చేపల చెరువులు ఏర్పాటు చేశారని, పదిరోజుల్లో వీటిని తీసివేయాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

న్యూస్ బాక్స్

కిటకిటలాడిన సిద్ధేశ్వర ఆలయం

కంగ్టి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకొని మండల కేంద్రమైన కంగ్టిలోని సిద్ధేశ్వర ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే స్వామివారి దర్శనం కోసం బారులుతీరారు. సిద్ధేశ్వర సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.

మాజీ ఎమ్మెల్యే, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోండి

కంగ్టి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : కంగ్టి-ముకుంద నాయక్‌తండాల మధ్య ప్రస్తుతం కొట్టుకుపోయిన వంతెన పనులను గతంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, కాంట్రాక్టర్ నర్సింహారెడ్డి కుమ్మక్కై నాసిరకంగా చేపట్టారని దిశ కమిటీ సభ్యుడు ప్రకాష్‌రాథోడ్ పేర్కొన్నారు. ప్రధాన వంతెన కొట్టుకుపోయేందుకు కారణమైన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని నిధులు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఉమా సంగమేశ్వరస్వామి ఆలయంలో పూజలు

పెద్దశంకరంపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : కొప్పోల్ ఉమా సంగమేశ్వరస్వామి ఆలయంలో శనివారం కాశీబుగ్గ నీరు రావడంతో భక్తులు ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ సోమవారం కాశీబుగ్గ రావడంతో భక్తులు స్వామివారికి ప్రత్యేక జలాభిషేకాలు, పూజలు చేశారు. భక్తులందరికీ రైస్ మిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు.

కాజీపల్లిలో బోనాలు

జిన్నారం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : కాజీపల్లిలో శ్రావణమాసం బోనాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోచమ్మ, పెద్దమ్మలకు భక్తులు బోనాలు సమర్పించారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవాల్లో మాజీ జడ్పీటీసీలు బాల్‌రెడ్డి, ప్రభాకర్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం ప్రతిపాదనలు పంపండి

- ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల కారణంగా నియోజకవర్గంలో దెబ్బతిన్న పంటలపై వ్యవసాయ, రెవెన్యూ అధికారులు వెంటనే సర్వే నిర్వహించి నష్ట పరిహారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆదేశించారు. సోమవారం ఆయాశాఖల అధికారులతో ఆయన సమావేశమై వివరాలను సేకరించారు. భారీగా కురిసన వర్షాల కారణంగా పెసర, మినుము, కంది పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. పెసర, మినుము మరో 20 రోజుల్లో చేతికి వచ్చే పరిస్థితి ఉందని, ఈ సమయంలో అకాల వర్షాల వల్ల దెబ్బతిందన్నారు. నీరు నిల్వడం కారణంగా పత్తి పంటకు నష్టం జరిగిందన్నారు. అధికారులు గ్రామస్థాయిలో సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదించాలని సూచించారు. దీంతోపాటు వర్షాలు, వరదల కారణంగా పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ రహదారులు అక్కడక్కడ దెబ్బతిన్నాయన్నారు. వాటి మరమ్మతులకు కూడా వెంటనే ప్రతిపాదనలు అందించాలని సూచించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సంజీవరెడ్డి

నిర్భయంగా ఫిర్యాదు చేయండి : ఎస్పీ

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా సంబంధిత పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలతో మాట్లాడారు.

ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

మెదక్ అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి 11 ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.

సివిల్ తగాదాల్లో తల దూర్చొద్దు

పోలీసులు సివిల్ తగాదాల్లో తల దూర్చొద్దని ఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. ఎవరైనా తల దూర్చితే శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఇదివరకు పోలీసుల ద్వారా సివిల్ తగాదాల్లో బాధపడిన వారు ఉంటే పోలీసు కంట్రోల్ రూం నంబరు 8712657888)కు, ఎస్పీ నేరుగా వచ్చి కలవాలని సూచించారు.

కారు, ద్విచక్ర వాహనం ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలు

చిన్నశంకరంపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : కారు, ద్విచక్ర వాహనం ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలైన సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని ఎస్ కొండాపూర్ శివారు మెదక్ చేగుంట రహదారి ఏడిప్పల్ వద్ద సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కొండాపూర్ గ్రామానికి చెందిన గొల్ల శ్రీశైలం, మోర రాజు, మూడ లక్ష్మణ్ గవ్వలపల్లి నుంచి బైక్‌పై యూరియా బస్తాలు తీసుకెళ్తున్నారు. ఆ సమయంలో గవ్వలపల్లి నుంచి మెదక్ వైపు వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొట్టడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గృహ ప్రవేశంలో మంత్రి దామోదర్



పిల్లుట్లలో గృహ ప్రవేశానికి హాజరైన దామోదర్ రాజనర్సింహ

శివ్వంపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పిలుట్లలో తన డ్రైవర్ బొమ్మిడాల శంకర్, అలాగే శంకర్ అన్న ఆంజనేయులు నూతన గృహాలను నిర్మించుకున్నారు. ఈ గృహ ప్రవేశాలకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మంత్రిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, సీనియర్ నాయకులు నవీన్ గుప్తా మురళీధర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

బొల్లారం అభివృద్ధికి సహకారం

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి



అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి

ఐడీఏబొల్లారం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఏర్పడిన పురపాలక సంఘాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. సోమవారం ఐడీఏబొల్లారం పట్టణంలో వైఎస్‌ఆర్, శక్తి ఎన్‌క్లేవ్, శ్రీరామ్‌నగర్, విఘ్నేశ్వర్‌కాలనీలతోపాటు బీరప్పబస్తీ, జ్యోతినగర్, మల్లన్ననగర్, బాలాజీనగర్, పాత గ్రామాల్లో రూ.2.75 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కిషన్, చంద్రారెడ్డి, హనుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ సమానత్వానికి మార్గదర్శకులు

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ సామాజిక సమానత్వానికి మార్గదర్శకులుగా నిలిచారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ కొనియాడారు. పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన నూతన విగ్రహాన్ని సోమవారం మంత్రి ఆవిష్కరించారు. అలాగే సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని నిర్వహించారు.

- న్యూస్ నెట్‌వర్క్



మెదక్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పాపన్నగౌడ్ చిత్రపటాకి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



సంగారెడ్డి టౌన్ : సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ మాధురి తదితరులు



నర్సాపూర్ : పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, మల్లేశ్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్



జహీరాబాద్‌లో సర్దార్‌సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు